# అబద్ధాలకు కేరాఫ్ అన్నాచెల్లెళ్లు

## రాష్ట్రంపై విషంకక్కిన రాహుల్‌గాంధీ, ప్రియాంక

- తెలంగాణలో అమలవుతున్న పథకాలపై అసత్య ప్రచారం
- పాత స్క్రిప్టునే మళ్లీ వల్లెవేసిన హస్తం పార్టీ జాతీయ నాయకులు

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అబద్ధాలే ఆలంబనగా, రాష్ట్రంపై విషం చిమ్మడమే లక్ష్యంగా తమ పర్యటన ప్రారంభించారు. ములుగులో బుధవారం జరిగిన బహిరంగ సభలో ఈ ఇద్దరు అన్నాచెల్లెళ్లు అలవోకగా పచ్చి అబద్ధాలను వల్లెవేశారు. రాష్ట్రంలో బ్రహ్మాండంగా అమలవుతున్న పథకాలను అమలు కావడం లేదంటూ నిస్సిగ్గుగా అసత్య ప్రచారం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదివేసి వెళ్లిపోయారు.

### పోడు పట్టాలపై నిస్సిగ్గుగా ఆరోపణ

రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన పోడు పట్టాలను తీసుకున్న గిరిజన రైతులను ఇటు స్టేజీ పైనా, అటు స్టేజీ ముందు పెట్టుకొని.. ప్రభుత్వం పోడు పట్టాలు పంపిణీ చేయాలేదంటూ రాహుల్, ప్రియాంక నిస్సిగ్గుగా ఆరోపించారు. ఇటీవల ప్రభుత్వం 1.57 లక్షల కుటుంబాలకు 6.06 లక్షల ఎకరాల పోడు పట్టాలను పంపిణీ చేసింది. ఈ పట్టాలు పొందిన వారిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సీతక్క తల్లిదండ్రులు కూడా ఉన్నారు. ఈ సభలో సీతక్క స్టేజీపైనే ఉన్నప్పటికీ అవేవీ పట్టించుకోకుండా పోడు పట్టాలపై అసత్య ప్రచారం చేశారు.

### కాళేశ్వరంపై మళ్లీ విషం

రాహుల్‌గాంధీ రాష్ట్రానికి వచ్చిన ప్రతిసారి కాళేశ్వరంపై విషం కక్కుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అయిన మొత్తం ఖర్చు రూ. 84వేల కోట్లు అయితే ఇందులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ మరోసారి అదే అబద్ధాన్ని వల్లెవేశారు. కాళేశ్వరం వల్ల రైతులకు కలుగుతున్న ప్రయోజనంపై ఏనాడూ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం.



ములుగులో రాహుల్ ప్రసంగిస్తున్న సమయంలో జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

### బీఆర్‌ఎస్ నేతలపై కేసులే లేవంట!

> బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు రెండూ ఒక్కటేనంటూ రాహుల్ గాంధీ మరోసారి రాజకీయ అజ్ఞానపు వ్యాఖ్యలు చేశారు. బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతిస్తున్నది కాబట్టి ఆ పార్టీ నేతలపై కేంద్రం కేసులు పెట్టడం లేదంటూ వింత వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ కవితపై ఈడీ పెట్టిన కేసులు, మంత్రులు గంగుల కమలాకర్, తలసానితో పాటు పలువురు ఎంపీలపై ఐటీ, ఈడీ దాడుల సంగతేంటో రాహుల్ గాంధీ చెప్పాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### డబుల్ బెడ్‌రూంలు ఇవ్వలేదా!.

రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండొద్దనే ఉద్దేశంతో పూర్తి ఉచితంగా సీఎం కేసీఆర్ పేదల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా డబుల్ బెడ్‌రూం పథకానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.70 లక్షల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేశారు. ఇప్పుడు ఇంటి స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. అలాంటిదిజజ తెలంగాణలో ఎవరికీ ఇల్లు ఇవ్వలేదంటూ రాహుల్ గాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉన్నది.

### రుణమాఫీ చేయలేదా?

రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయలేదంటూ రాహుల్ గాంధీ మరో పచ్చి అబద్ధం చెప్పారు. ఇప్పటికే రెండు విడతల్లో సుమారు 23 లక్షల మంది రైతులకు చెందిన రూ.13వేల కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఈ విధంగా 2014లో, ఇప్పుడు రెండుసార్లు కలిసి మొత్తం 58.29 లక్షల మంది రైతులకు రూ. 30 వేల కోట్ల రుణాలను మాఫీ చేసింది. వరుసగా రెండుసార్లు రైతులకు రుణమాఫీ చేసిన రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమే.

### ప్రసంగం మధ్యలోనే వెళ్లిపోయిన జనం

వరంగల్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) :రాహుల్ మాటల్లో నిజాలు లేకపోవడంతో మీటింగ్‌కు వచ్చిన జనం మధ్యలోనే వెళ్లిపోయారు. భూపాలపల్లి అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు వేదికపైనుంచి కిందికి దిగిపోయారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి పిలిచినా మళ్లీ రాలేదు. అంతకుముందు సీతక్క ప్రసంగించిన తర్వాత గండ్ర సత్యనారాయణ మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో పొన్నం ప్రభాకర్ పాటలు, వీడియో ప్లే చేయాలని చెప్పారు. దీంతో గండ్ర సత్యనారాయణ మాట్లాడకుండానే వేదిక దిగి వెళ్లిపోయారు. దీంతో భూపాలపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు అసంతృప్తికి లోనయ్యారు. తమను కాంగ్రెస్ రాష్ట్ర నేతలు, ములుగు అభ్యర్థి సీతక్క అవమానించారని గండ్ర సత్యనారాయణ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ధాన్యం కొంటలేరట

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా ఉంది రాహుల్‌గాంధీ తీరు. రాహుల్ గాంధీ అమాయకత్వాన్ని చూసి తెలంగాణ రైతులు జాలి పడుతున్నారు. దేశంలో మరే రాష్ట్రం కొనుగోలు చేయని విధంగా రైతులు పండించిన ప్రతి గింజను తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో ఎకరానికి 16 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నది.

### ధరణితో దోపిడీయా?

> ఎవరి భూములపై వారికే హక్కు కల్పించేలా, ఒకరి భూములు మరొకరు ఆక్రమించకుండా ఉండేందుకు ప్రభుత్వం ధరణిని తీసుకొచ్చింది. తద్వారా రాష్ట్రంలో భూ తగాదాలు తగ్గిపోయాయి. తమ భూమికి ఢోకా లేదని రైతులు, ఇతర ప్రజలు గుండెపై చేయి వేసుకొని ప్రశాంతంగా నిద్రపోతున్నారు. రాహుల్ గాంధీ మాత్రం ధరణితో దోచుకుంటున్నారంటూ తప్పుడు ప్రచారం చేయడం గమనార్హం.



రాహుల్ పర్యటన నేపథ్యంలో ములుగు జిల్లా రామాంజాపురంలో బుధవారం పోస్టర్లు వెలిశాయి. మేడారం జాతరకు జాతీయ హోదా, గిరిజన వర్సిటీపై మాట్లాడని రాహుల్.. ఓట్ల కోసం జిల్లాకు వస్తున్నారంటూ పోస్టర్లలో రాసి ఉంది.
- ములుగు

# రాహుల్‌ది గోబెల్స్ ప్రచారమే

- అబద్ధాలను నమ్మించే ప్రయత్నం
- 'కాళేశ్వరం'లో అవినీతి పెద్ద జోక్
- కాంగ్రెస్ హామీలన్నీ ఉత్త మాటలే
- మ్యానిఫెస్టోను అమలు చేసిన చరిత్ర ఆ పార్టీకి లేదు
- ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కేసీఆరే..
- రాష్ట్ర ప్రజలంతా బీఆర్‌ఎస్ వెంటే
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పదేపదే అబద్ధాలను చెప్తూ వాటినే నిజాలుగా నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆయనది కేవలం గోబెల్స్ ప్రచారమేనని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. దాదాపు రూ.85 వేల కోట్ల ఖర్చుతో నిర్మితమైన కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగినట్టు రాహుల్ ఆరోపించడాన్ని అతిపెద్ద జోక్‌గా పేర్కొన్నారు. గతంలో ఏ మ్యానిఫెస్టోనూ అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు లేదని, బీఆర్‌ఎస్ మాత్రం చెప్పనివి కూడా చేసి చూపిందని పేర్కొన్నారు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ సీఎం కేసీఆరేనని స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను వివరించడంతోపాటు విపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలపై తనదైన శైలిలో సమాధానాలిచ్చారు. 2009లో కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఏ హామీనీ అమలు చేయలేదని, గత ఆరు దశాబ్దాల్లో ఆ పార్టీ చేయలేని పనులను సీఎం కేసీఆర్ కేవలం పదేండ్లలోనే చేసి చూపారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అంటేనే ఉత్త మాటలు, మూటలు, ముఠాలు, కుమ్ములాటలని.. టికెట్లను సైతం అమ్ముకుంటున్నట్టు స్వయంగా ఆ పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అనేక పార్టీలు మారిన చరిత్ర టీపీసీసీ ఛీఫ్ రేవంత్‌రెడ్డిదని, సాక్షాత్తూ కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీనే ఆయన 'బలిదేవత' అన్నాడని గుర్తుచేశారు. తమది దొరల తెలంగాణ అయితే, కాంగ్రెస్‌ది దొంగలు, బ్రోకర్లు, ముఠాల తెలంగాణనా? అని ప్రశ్నించారు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ సీఎం కేసీఆరే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

### ఆ ఘనత బీఆర్‌ఎస్‌దే..

గతంలో నీరు, విద్యుత్తు సమస్యల ప్రస్తావన లేకుండా అసెంబ్లీ సమావేశాలు జరిగేవి కాదని, ఇప్పుడు వాటి ఊసే లేకపోవడం బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఘనతేనని మంత్రి హరీశ్ చెప్పారు. దేశంలో తొలిసారి రైతుబంధు, దళితబంధు పథకాలను ప్రవేశపెట్టింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆయన గుర్తుచేస్తూ.. బీఆర్‌ఎస్ పథకాలను కాంగ్రెస్ కాపీ కొట్టి తన మ్యానిఫెస్టోలో పెట్టుకున్నదని, ఉచిత కరెంటును 'ఉత్త కరెంటు'గా మార్చిన ఘనత ఆ పార్టీదేనని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో రూ.200గా ఉన్న వృద్ధాప్య పింఛన్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒకేసారి రూ.2 వేలకు పెంచడంతోపాటు రైతుబంధు కింద 62 లక్షల మంది రైతులకు 11 విడతల్లో మొత్తం రూ.73 వేల కోట్లు ఇచ్చామని, 'కల్యాణలక్ష్మి' పథకం కింద 13 లక్షల పైచిలుకు లబ్ధిదారులకు రూ.12,470 కోట్లు అందజేశామని వివరించారు.



### రాజకీయ లబ్ధి కోసమే మోదీ అడ్డగోలు వ్యాఖ్యలు

> కేసీఆర్ ఎప్పుడూ తెలంగాణ అభివృద్ధి గురించే మాట్లాడతారని గతంలో స్వయంగా పార్లమెంట్‌లోనే చెప్పిన మోదీ.. ఇప్పుడు ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మంత్రి హరీశ్ ధ్వజమెత్తారు. రాష్ట్ర సాధన కోసం పదవులకు ఎన్నోసార్లు రాజీనామా చేయడంతోపాటు ఏకంగా ప్రాణత్యాగానికే సిద్ధపడిన నేత కేసీఆర్ అని గుర్తుచేశారు. ఆయన ఆమరణ దీక్షతో తెలంగాణ అట్టుడకటం వల్లే ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తుచేశారు.

### బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో మరిన్ని పథకాలు

రాష్ట్ర వృద్ధిరేటు పెరుగుదలను దృష్టిలో ఉంచుకొనే కొత్త పథకాలపై నిజాయితీగా హామీలు ఇచ్చామని, నిధులకు ఎలాంటి లోటు లేనందున మరికొన్ని పథకాలను బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో చేర్చాలన్న ఆలోచన ఉన్నదని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రత్యేకించి యువతకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని యోచిస్తున్నామని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తెలంగాణ ప్రజలు తెలివైనవారని, రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచుకునేందుకు మళ్లీ బీఆర్‌ఎస్‌ను గెలిపించడం ఖాయమని తెలిపారు. రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిదారులందరితోపాటు సెటిలర్లంతా బీఆర్‌ఎస్ వెంటే ఉంటారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎవరికీ బీటీమ్ కాదని, ప్రజల టీమ్ అని, ప్రజలే తమకు హైకమాండ్ అని తేల్చిచెప్పారు.

### 'కేసీఆర్ బీమా'తో పేదలకు సామాజిక భద్రత

బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే 'కేసీఆర్ బీమా' పథకం ద్వారా దాదాపు కోటి పేద కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడంతోపాటు రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం ఇవ్వనున్నట్టు మంత్రి హరీశ్ చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు సన్నబియ్యంతో అన్నం పెడుతున్నామని చెప్పారు. 'ధరణి' పోర్టల్ రాకముందు భూ రికార్డులను ఎవరైనా మార్చేసేవారని, ఇప్పుడు యజమాని వేలుముద్ర లేకుండా ఎలాంటి మార్పు చేసేందుకు అవకాశమే లేదని పేర్కొన్నారు. గతంలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు కట్టించకపోవడం వల్లే నేడు డబుల్ బెడ్రూం ఇండ్ల పథకాన్ని అమలు చేయాల్సి వస్తున్నదని, అప్పట్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.40 వేలు ఇస్తే.. ఇప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తున్నదని తెలిపారు. కొవిడ్ సంక్షోభం వల్ల వ్యవసాయ రుణాల మాఫీలో కొంత జాప్యం జరిగిందని, అయినా ఇప్పటివరకు రూ.31 వేల కోట్ల రుణాలను మాఫీ చేశామని చెప్పారు.

### ఎంపీ అరవింద్ వ్యాఖ్యలు దుర్మార్గం

- ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం ఆగ్రహం



హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): నిజామాబాద్ ఎంపీ అరవింద్ హద్దు మీరు ప్రవర్తిస్తున్నారని ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితపై అరవింద్ చేసిన వ్యాఖ్యలను బుధవారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. ఎంపీగా గెలిచి నాలుగేండ్లు అయినా నిజామాబాద్ ప్రజలకు అరవింద్ చేసిందేమి లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ తెచ్చిన బీమా పథకంపై మాట్లాడటం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలు రాజకీయ ఉన్మాదానికి ప్రతీకలని విమర్శించారు. అరవింద్‌ను రాబోయే రోజుల్లో ప్రజలు చెప్పుతో సమాధానం చెప్తారని హెచ్చరించారు.

### తెలంగాణ రాజ్య సమితికి గ్యాస్ సిలిండర్ గుర్తు!

- ఎన్నికల కమిషన్ నిర్ణయం

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): కొత్తగా తెలంగాణ రాజ్య సమితి అనే పార్టీకి గ్యాస్ సిలిండర్ గుర్తును కేటాయిస్తూ ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకున్నది. తెలంగాణలో రిజిస్టర్డ్ గుర్తింపులేని రాజకీయ పార్టీ అయిన తెలంగాణ రాజ్య సమితి.. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేస్తామని, అందుకు కామన్ సింబల్ కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నది. దీనిని ఎన్నికల కమిషన్ పరిశీలించి, గ్యాస్ సిలిండర్ గుర్తును కేటాయించింది. ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని, ఈ పార్టీ తరఫున బరిలో ఉండే అభ్యర్థులందరికీ గ్యాస్ సిలిండర్ గుర్తునే కేటాయించాలని ఆదేశించింది. ఎన్నికల నిబంధనల ప్రకారం కనీసం 5% సీట్లలో సదరు పార్టీ పోటీ చేయాల్సి ఉంటుందని, అలా చేయకపోతే ఒకే గుర్తును కేటాయించనవసరం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి సూచించింది. సదరు పార్టీ పోటీ చేయని స్థానాల్లో ఆ గుర్తును ఇతరులకు కేటాయించవచ్చని కూడా స్పష్టంగా పేర్కొన్నది.

# రాహుల్ 'ఎలక్షన్' గాంధీ!

- నిజామాబాద్ జిల్లాలో మతసామరస్యం చెడగొట్టొద్దు
- కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హితవు
- రాష్ట్ర విభజన హామీలపై ఎన్నడూ, ఎక్కడా మాట్లాడలేదని విమర్శ
- బీఆర్‌ఎస్ అంటే బీసీల ప్రభుత్వమని వెల్లడి

బోధన్, అక్టోబర్ 18: తెలంగాణలో ఎన్నికలు రావడంతో పొలిటికల్ టూరిస్టులు వస్తున్నారని, వారు రాష్ట్రానికి రావొచ్చు కానీ, ఇక్కడి సుహృద్భావ వాతావరణాన్ని చెడగొట్టవద్దని కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హితవు చెప్పారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో బుధవారం స్థానిక ఎమ్మెల్యే షకీల్‌తో కలిసి కవిత విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ తన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. 'నిజామాబాద్ జిల్లాలో పచ్చబడ్డ పొలాలను చూడండి.. మంచిగైన కాలువలను చూడండి.. నిండుకుండలా ఉన్న ఎస్సారెస్పీని చూడండి.. అంకాపూర్ చికెన్ రుచి చూడండి.. డిచ్‌పల్లి రామాలయాన్ని సందర్శించండి.. బోధన్‌కు వచ్చి ఆతిథ్యాన్ని స్వీకరించండి.. అన్నీచూసి వెళ్లిపొండి. అంతేతప్ప మీరు, బీజేపీ నాయకులు పోటీపడి ఇక్కడ మతతత్వాన్ని రెచ్చగొట్టకండి' అని ఆమె రాహుల్‌కు సూచించారు. నిజామాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ పటిష్ఠతను చూసి కాంగ్రెస్, బీజేపీలు భయపడుతున్నాయని, అందుకే మొన్న ప్రధాని మోదీ నిజామాబాద్‌కు రాగా, ఇప్పుడు రాహుల్ గాంధీ వస్తున్నారని కవిత పేర్కొన్నారు.

### మతచిచ్చు పెట్టవద్దు

బీఆర్‌ఎస్ పాలనలో ఎక్కడా మత కలహాలు లేవని, అన్ని మతాలకు చెందినవారు శాంతి సామరస్యాలతో ప్రశాంతంగా జీవిస్తున్నారని కవిత తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సీఎంను మార్చాలనుకున్నప్పుడల్లా మత కలహాలు లేపేవారని గుర్తుచేశారు. గంగా జమునా తెహజీబ్ సంస్కృతిని నాశనం చేయవద్దని బీజేపీ, కాంగ్రెస్‌లను కోరారు.



బోధన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎమ్మెల్యే షకీల్

### విభజన హామీలపై రాహుల్ మాట్లాడారా?

> పార్లమెంట్‌లో ప్రధాని మోదీ తెలంగాణ ఏర్పాటును విమర్శిస్తూ మాట్లాడుతుంటే అక్కడే ఉన్న తల్లీకొడుకులు (సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ) ఎందుకు అభ్యంతరం చెప్పలేదని కవిత ప్రశ్నించారు. విభజన హామీల గురించి ఒక్కసారైనా పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. రాహుల్ గాంధీ ముత్తాత నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మొదలుపెట్టిన శ్రీరాం సాగర్‌ప్రాజెక్ట్‌ను టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేసుకున్నామని అన్నారు. తెలంగాణలో రైతులు, ప్రాజెక్టుల గురించి మాట్లాడటానికి కాంగ్రెస్ నాయకులకు ఏమీలేదని విమర్శించారు.

### బీఆర్‌ఎస్ అంటే.. బీసీల ప్రభుత్వం

బీసీల సంక్షేమాన్ని కాంగ్రెస్ పాలకులు ఏనాడూ పట్టించుకోలేదని, నేడు రాహుల్ గాంధీ బీసీల కులగణన చేయాలనటం విచిత్రంగా ఉన్నదని కవిత ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాగానే తాము బీసీలకు పెద్దపీట వేశామని, బీఆర్‌ఎస్ పార్టీ అంటే బీసీల ప్రభుత్వమని అన్నారు. సీఎం కేసీఆర్ ఎంతో అధ్యయనం చేసి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో కొత్తగా ప్రవేశపెట్టిన కేసీఆర్ బీమా, సౌభాగ్యలక్ష్మి పథకాలతో ఇప్పటివరకు రైతుబీమా, కొన్ని రకాల పింఛన్లు అందనివారికి ఎంతో మేలు జరుగుతుందని కవిత తెలిపారు. అంతకుముందు బోధన్ 31వ వార్డుకు చెందిన పలువురు యువకులు స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి కవిత పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# కాంగ్రెస్ బీసీ ద్రోహి

- ఆ పార్టీని బొందపెట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల ధ్వజం



రవీంద్ర భారతి, అక్టోబర్ 18: తెలంగాణలో కాంగ్రెస్ పూర్తిగా రెడ్ల పార్టీగా మిగిలిపోయిందని, బీసీ ద్రోహిగా మారిన ఆ పార్టీని బీసీలు ఏకమై బొందపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. బీసీలకు ఎక్కువ సీట్లు ఇస్తామని చెప్పిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సర్వేల పేరుతో టికెట్లు అమ్ముకొని మొండిచేయి చూపించారని విమర్శించారు. బుధవారం ఆయన హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పాతబస్తీలో కాంగ్రెస్‌కు బలంలేని ఓడిపోయే స్థానాలను బీసీలకు కేటాయించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇదే వైఖరి కొనసాగిస్తే రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదని హెచ్చరించారు. మిగతా సీట్లలో బీసీలకు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు సీట్ల చొప్పున ఇవ్వకపోతే కాంగ్రెస్ బీసీ ద్రోహుల పార్టీగా మిగిలిపోతుందని చెప్పారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, సదానందం, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్ మేరు, మల్లికార్జున్‌యాదవ్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గుండి గ్రామస్థులతో మాట్లాడుతున్న శ్యాంనాయక్

# శ్యాంనాయక్‌కు చుక్కెదురు

- ప్రచారాన్ని అడ్డుకుంటున్న ప్రజలు
- మొన్న గుండి గ్రామస్థులు, నిన్న దబోళి ప్రజల అడ్డగింత

ఆసిఫాబాద్/జైనూర్, అక్టోబర్ 18: ఆసిఫాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చెప్పుకుంటూ ప్రచారం చేస్తున్న అజ్మీరా శ్యాంనాయక్‌కు ప్రజల నుంచి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లాకేంద్రానికి వచ్చిన గుండి గ్రామస్థులతో శ్యాంనాయక్ మాట్లాడేందుకు యత్నించగా తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. గ్రామస్థుల నిరసనతో శ్యాంనాయక్ తన మెడలో ఉన్న కాంగ్రెస్ కండువాను తీసేసి, సాధారణ వ్యక్తిలా నిలబడాల్సి వచ్చింది. మంగళవారం రాత్రి జైనూర్ మండలం దబోళి గ్రామానికి ప్రచారానికి వెళ్లగా, గ్రామస్థులు అడ్డుకున్నారు. టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ కండువా వేసుకొని ఎలా ప్రచారం చేస్తావని నిలదీశారు. దీంతో చేసేదేమి లేక ఆయన వెనుదిరుగాల్సి వచ్చింది. వరుసగా ఎదురవుతున్న చేదు అనుభవాలు శ్యాంనాయక్‌తోపాటు కాంగ్రెస్ శ్రేణుల్లోనూ నిరాశ నింపుతున్నది.

# భాగ్యలక్ష్మి వద్దు గన్‌పార్క్ ముద్దు!

- ఆరెస్సెస్ మూలాలు దాచేందుకు తంటాలు పడుతున్న రేవంత్
- అమరీందర్‌సింగ్ లేఖ బయటపడటంతో జిమ్మిక్కులు

*హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ):* పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చూపు ఇప్పుడు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వైపు నుంచి గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వైపు మళ్లింది. గతంలో ఆయన ప్రతి దానికీ బీజేపీ నేతల మాదిరిగా భాగ్యలక్ష్మి ఆలయం దగ్గర ప్రమాణం చేద్దామా? అంటూ ప్రత్యర్థుల మీద సవాల్ విసిరేవారు. భాగ్యలక్ష్మి ఆలయం లాంటి సున్నిత ప్రదేశాలను రాజకీయ సవాళ్లకు వేదికలుగా మలుచుకుంటే రాజకీయంగా మేలు జరుగుతుందనేది బీజేపీ వ్యూహం. అలాంటి ప్రదేశాలను వెదికి మరీ ప్రమాణాల పేరుతో హడావుడి చేయడం బీజేపీ నేతలకు పరిపాటి. అయితే, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి కూడా భాగ్యలక్ష్మి ఆలయాన్ని ఎంచుకోవడాన్ని చూసి చాలామంది ఆశ్చర్యపోయారు. ఈ నేపథ్యంలోనే ఆరెస్సెస్ మూలాలు ఉన్న వ్యక్తిని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిని చేయవద్దంటూ పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్ గతంలో సోనియాగాంధీకి రాసిన లేఖ ఒకటి ఆలస్యంగా బయటపడింది. తన మూలాలపై మరింత రచ్చ జరగకముందే జనం దృష్టిని మరల్చే లక్ష్యంతో ఆయన చూపు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వైపు మళ్లిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో విడుదల చేసిన తరువాత దానిపై స్పందించేందుకు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలోనూ తొలుత రేవంత్‌రెడ్డి భాగ్యలక్ష్మి ఆలయం ప్రస్థావన తీసుకొచ్చి ఆ వెంటనే మాట మార్చడం గమనార్హం. ఆలయం అంటే కొందరికి, మసీదు అంటే మరికొందరికి నచ్చకపోవచ్చు. కాబట్టి గన్‌పార్కు వద్ద ప్రమాణం చేద్దామంటూ మాటమార్చేశారు. అంతేకాకుండా రెండు రోజుల కిందట గన్‌పార్కు వద్దకు పోయి గతంలో భాగ్యలక్ష్మి ఆలయం దగ్గర చేసిన మాదిరిగానే నానా హంగామా చేయడం గమనార్హం.

# బీఆర్‌ఎస్ హయాంలోనే ఆరెకటికల అభ్యున్నతి

ఖైరతాబాద్, అక్టోబర్ 18: బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఆరెకటికల అభ్యున్నతికి పాటుపడిందని ఆరెకటిక ట్రస్ట్ చైర్మన్ గౌళికార్ నర్సింగ్‌రావు తెలిపారు. సంఘం అఖిల భారత కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ట్రస్ట్ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి డబ్బికార్ శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. 75 ఏండ్ల కాలంలో ఏ ప్రభుత్వమూ తమను ఆదుకోలేదని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సముచిత స్థానం కల్పించిందని చెప్పారు. ప్రభుత్వం ఆరెకటికల కోసం కోకాపేటలో ఒక ఎకరం భూమి, ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.ఒక కోటి నిధులు కేటాయించిందని, బీసీ బంధులో ఆరెకటికలకు అవకాశం కల్పించిందని, వరంగల్‌లో రూ.1.5 కోట్లతో భవన నిర్మాణం చేపట్టిందని వివరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం కోసం ఆరెకటికలు కృషి చేస్తారని చెప్పారు. సంఘం జాతీయ కార్యదర్శి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత, భారత జాగృతి కో కన్వీనర్ సంతోష్‌కుమార్ హింగోల్కర్‌కు ఎన్నికల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఆరెకటిక ట్రస్ట్ చైర్మన్ నర్సింగ్‌రావు